

పాఠశాల విద్యార్థులకు వీడియో పాఠాల కార్యక్రమానికి ప్రారంభోత్సవం చేస్తున్న ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.ఆర్. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ శ్రవణ్‌కుమార్, డాక్టర్ పి.నారాయణ రెడ్డి, దర్శకుడు బాపు కూడా ఉన్నారు.

# దేశానికే వరం 'వీడియో విద్యావిధానం'

(ఆంధ్రభూమి ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 17: దేశంలో ఏ రాష్ట్రంలో ఎక్కడా ప్రవేశపెట్టనటువంటి దృశ్య, శ్రవణ విద్యా విధానాన్ని నూతన ప్రయోగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టి భారతదేశానికి ఒక వరం ప్రసాదించిందని ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.రామారావు నేడిక్కడ అన్నారు.

తెలుగు లలిత కళాతోరణంలో బుధవారం సాయంత్రం దృశ్య శ్రవణ నూతన విద్యావిధానానికి జ్యోతిని వెలిగించి ప్రారంభోత్సవం చేస్తూ ఆయన పై విధంగా అన్నారు. ఆధునిక విద్యావిధానాన్ని విప్లవాత్మకమైన మార్పులతో తీసుకురావాలనేది తెలుగుదేశం ప్రభుత్వ విధానమని అందువల్ల ఈ నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని శ్రీ రామారావు స్పష్టంచేశారు.

తెలుగుభాషకు గౌరవం చేకూర్చడానికి 1983 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం తెలుగు విశ్వవిద్యాలయం నెలకొల్పిందని మన భాషను గుర్తుంచుకోలేని స్థితిలో మనం ఉన్నామని ఆయన అన్నారు.

తెలుగుభాషను అధికారభాషగా ప్రవేశపెట్టి తెలుగువాడినని చెప్పుకునే గుండె నిబ్బరాన్ని అందించడానికి ప్రభుత్వం కృషిచేస్తున్నదని శ్రీ రామారావు చెప్పారు. దేశ రక్షణ ఆయుధాలు ఇతర దేశాలనుండి కొనుగోలు చేసుకునే విధానంలాంటి దౌర్భాగ్య స్థితిలో విద్య ఉన్నదని ఆయన ప్రస్తుత విద్యావిధానాన్ని విమర్శించారు.

స్వాతంత్ర్యం అనంతరం దేశంలో ఎన్ని సంస్కరణలు వచ్చినా విద్యావిధానంలో విప్లవాత్మకమైన మార్పులురాలేదని బ్రిటిష్‌వారి విద్యావిధానంవల్ల భారతీయులను బానిసలుగా మార్చిందని, గతంలో ఆచరణ బద్ధమైన విద్యను బ్రిటిష్‌వారు ఆదరించలేదని వారి విద్య దేశభక్తికి మానవ సేవ ప్రబోధించలేదని విజ్ఞానం కొరవడినందుకే ముందుకు పోలేకపోయామని ఆయన అన్నారు.

తాను ముప్ఫయి సంవత్సరాలుగా చలనచిత్ర

## ఎన్టీఆర్ ప్రకటన

రంగంలో ఉన్నానని, చలనచిత్ర ప్రభావం గుర్తించానని, సమస్యలలో సతమతమవుతున్నవారికి చిత్రాలు ఆహ్లాదాన్ని వినోదాన్ని కల్పిస్తాయని, అయితే ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల చలనచిత్ర రంగం వ్యాపారంగా మారిందని ఆయన విమర్శించారు.

దృశ్య శ్రవణ విద్యావిధానం సామాజ కపరమైన విధానంగా మారాలని ప్రభుత్వం సంకల్పించిందని, ఇది తెలుగుదేశం ప్రభుత్వం స్వంత ఆలోచనా విధానంలో రూపొందించిన ఈ విధానాన్ని ప్రజలకు ఒక వరంగా ఇస్తున్నదని శ్రీ రామారావు స్పష్టం చేశారు. ఈ విధానం ఆకర్షణీయమైన సాంప్రదాయాలతో కూడుకున్న దేశభక్తిని పెంపొందించే విధంగా విద్యార్థిలోకానికి జీర్ణించుకోవడానికి ఉపయోగపడేదిగా ఆయన అభివర్ణించారు.

ఇదివరకు నేను ఎవరికి అభినందనలను తెలుపలేదని ఆయన అంటూ ఈ దృశ్య శ్రవణ నూతన విద్యా విధానానికి రూపురేఖలు అందించిన నిర్మాతలు శ్రీయుతులు బాపు, రమణలకు ఆయన అభినందనలు తెలిపారు. శ్రీయుతులు బాపు, రమణలకు ఒక బిరుదు ఇవ్వాలనుకున్నానని ఆ బిరుదు ఏమిటో నాకు ఇప్పుడు స్ఫురించలేదని తెలుగు పండుగరోజు ప్రభుత్వ కార్యక్రమం రోజున ఆ బిరుదు ప్రదానం చేయాలని అనుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

అంతకుముందు శ్రీ రామారావు బాపు రమణలకు శాలువా కప్పి సన్మానం చేశారు.

దృశ్య శ్రవణ విద్యావిధాన ప్రారంభోత్సవానికి తెలుగు సమాచారం పెద్ద ఎత్తున అలంకరణ ఏర్పాట్లు చేశారు. వివిధ జిల్లాలనుండి వచ్చిన జానపద నృత్య కళాకారులు ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.రామారావును సన్నాయి వాయిద్యాలతో, తప్పెట్ల పాటలు రాగాల నృత్యంలో సభాస్థలివరకు స్వాగతం చెప్పింది.

అనంతరం మా తెలుగుతల్లికి మల్లెపూదండ అనే గేయంతో వేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన మానవులను ఆకర్షించింది.